క్లుప్తంగా

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యోగుల సమావేశం



మాట్లాడుతున్న స్టేట్ కమిషనర్, చైర్మన్, తదితరులు

తిరుపతి సిటీ: స్థానిక యూత్ హాస్టల్‌లో ఆదివారం హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. స్టేట్ కమిషనర్ తుంగా శ్రీకాంత్, చైర్మన్ పుల్లూరు దయాకర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు చేపట్టాల్సిన అంశాలు, బోధించాల్సిన అంశాలు, ధృవీకరణ పత్రాల పంపిణీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం స్కౌట్స్ డిస్ట్రిక్ ఆఫీసర్స్, మాస్టర్స్ అండ్ గైడ్స్ సలహాలు తీసుకున్నట్టు వెల్లడించారు. సమావేశంలో సభ్యులు సుమంత్, మధు, నాజ్మా శ్రీకాంత్, దివ్య, రహంతుల్లా, నాగచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్‌ల వితరణ



ల్యాప్‌టాప్‌లతో తేజో సూర్య ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ: స్థానిక సంజయ్‌గాంధీ కాలనీలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు ఆదివారం తేజోసూర్య ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు ల్యాప్‌టాప్‌లు వితరణ చేశారు. ఫౌండేషన్ అధినేత డాక్టర్ జిడ్డు సూర్య సుబ్రమణ్యం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు. ప్రతి శనివారం గర్ల్స్ చైల్డ్ ఆరోగ్య పరిరక్షణపై గంట పాటు అవగాహన కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. హెచ్‌ఎం ఎం.మునిశారద, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న బెల్లం రమేష్ మిత్ర బృందం

తిరుపతి తుడా: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి నగరానికి చెందిన బెల్లం రమేష్ ఆధ్వర్యంలో ఆయన మిత్ర బృందం అలిపిరిలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి ఆధ్వర్యంలో..



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి గరుడ సేవ సందర్భంగా ఆదివారం అలిపిరి పాదాల మండపం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఆపిల్ పండ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ చైర్ పర్సన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.సురేష్, శాంతినాదార్ శేషాద్రి, జీవన్, విష్ణు, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న గుండ్లపల్లి ఆంజనేయులు

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీటీఏ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు జ్యోతిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. బీటీఏ జాతీయ ఉపాధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. హామీ ఇచ్చిన 16 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగుల సమస్యలు ఒక్కటీ పరిష్కరించకపోవడం దారుణమన్నారు. దసరాకు కనీసం రెండు డీఏలను ప్రకటించాలని, 11వ పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, ఆదికేశవులు, గోపాలయ్య, రాజేంద్రుడు, తులసీరామ్, సుబ్బయ్య, జయబాల, జ్యోతి వెంకటరత్నం, శివ, వెంకటయ్య, బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కేవీ చౌదరి



తిరుపతి కల్చరల్: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన కేవీ.చౌదరి ఎంపికయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బ్రహ్మాండోత్సవం













తిరుమల: కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారు ఆదివారం ఉదయం మోహినీ అవతారంలో ఊరేగుతూ భక్తులను సమ్మోహనం పరిచారు. రాత్రి గరుడ వాహనంపై నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తకోటిని ఆనంద పరవశులను చేశారు. స్వామిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో తిరుమల మాడ వీధులు జనసముద్రాన్ని తలపించింది. గరుడ వాహనం సందర్భంగా దేశంలోని 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన 26 కళాబృందాల్లోని 568 మంది కళాకారులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేటి వాహనాలు: బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హనుమ వాహనం జరుగుతుంది. స్వామివారు భక్త శిఖామణి హనుంతుడిని వాహనంగా చేసుకుని తిరువీధుల్లో ఊరేగుతారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గజ వాహన సేవ జరుగుతుంది. తనను శరణు కోరిన వారిని కాపాడతానని చాటి చెప్పడానికి శ్రీనివాసుడు గజ వాహనంపై ఊరేగుతారు. సోమవారం సాయంత్రం రథరంగ డోలోత్సవం సేవ పేరుతో స్వర్ణరథం నిర్వహిస్తారు. సువర్ణ ప్రభలతో దర్శనమిచ్చే శ్రీవేంకటేశ్వర స్వామివారు స్వర్ణకాంతులీలనే స్వర్ణరథంపై ఊరేగుతారు.











గరుడోత్సవానికి పట్టువస్త్రాలు, గజమాలలు తీసుకొచ్చిన పేరూరు గ్రామస్తులు



తిరుపతి రూరల్ మండలం నుంచి పల్లకీ ఉత్సవానికి సారె తీసుకొచ్చిన భక్తులు



విశేషాలంకరణలో తుమ్మలగుంట కల్యాణ వెంకన్న

రేపు మెడికల్ కాలేజీల ప్రైవేటుపరంపై నిరసన



మాట్లాడుతున్న తలారి రాజేంద్ర

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు తలారి రాజేంద్ర తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైద్య ఆరోగ్య, విద్యా రంగాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. పేద పిల్లలకు వైద్య విద్యను అందించాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారని తెలిపారు. వాటిని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుయాయులకు అప్పగించాలని కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు తమతో కలిసి నిరసన కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: తన రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన కవి గుర్రం జాషువా అని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి కొనియాడారు. రంగస్థలి కార్యాలయంలో ఆదివారం గుర్రం జాషువా జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కవులను సత్కరించారు. కేఏస్.రాజా, కళాకారులు కేశవులు, సోము ఉమాపతి, విజయభాస్కర్‌రెడ్డి, జయసింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మునేంద్రారెడ్డి పాల్గొన్నారు. అలాగే వేమన విజ్ఞాన కేంద్రంలో గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు ఎస్వీయూ పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు, నడ్డినారాయణ, తోట వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, అంకమ నాయుడు, వెంకటాచలపతి, మౌని, వెంకటరమణ, గొడుగు చింత గోవిందయ్య పాల్గొన్నారు. ఎంఆర్‌పల్లిలోని ఆర్‌పీఐ కార్యాలయంలో దళిత సాహిత్య వికాస వేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువాకు నివాళులర్పించారు. గొడుగు చింత గోవిందయ్య, పి.అంజయ్య, ప్రసాద్‌రావు, ఏ.సుబ్రమణ్యం, భాష, పలువురు కవులు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

కళాసృష్టి సంస్థకు అవార్డు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి చెందిన కళాసృష్టి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును అందజేసింది. ఇందులో భాగంగా శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవ సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కళాసృష్టి సంస్థ అధ్యక్షుడు దశరథాచారి అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలోని వివిధ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాపితం చేయడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ ప్రసిద్ధి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో విశిష్ట స్థానం కలిగిన కళారంగానికి చెందిన కాయబొమ్మల కళాకారుడు డాక్టర్ జి.దశరథాచారి 2024-25 సంవత్సరానికిగాను ఆంధ్రప్రదేశ్ వార్షికి ఎక్సెలెన్స్ అవార్డును అందుకున్నారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

వ్యాయామంతో గుండె పదిలం



జెండా ఊపి 3కే రన్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ, ఎంజీఎం డైరెక్టర్

శ్రీకాళహస్తి: వ్యాయామంతో గుండె ఆరోగ్యంగా ఉంటుందని శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. 29న ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో 3కే రన్ జరిగింది. ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయామం కోసం కొంత సమ యం కేటాయించాలన్నారు. దీంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో గుండె సంబంధించి ఓపీ పూర్తిగా ఉచితమని 28, 29, 30వ తేదీల్లో 50శాతం రాయితీతో ఈసీజీ, 2డీ, వంటి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురపాలకసంఘ కమిషనర్ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

హంస వాహనంపై వీణాపాణి



సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై విహరిస్తున్న మూలస్థాన ఎల్లమ్మ

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూస్థాన ఎల్లమ్మదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సరస్వతీ దేవి అవతారంలో హంస వాహనంపై కొలుదీరి భక్తులకు అభయమిచ్చారు. కార్య క్రమంలో ఆలయ ఈఓ మమత, చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్ రోడ్డులో...

చంద్రగిరి కొత్తపేట ఆర్ఎఫ్ రోడ్డులోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం(పుట్టాలమ్మ)లో శ్రీసంతోషి మాత దుర్గాదేవి అవతారంలో భక్తులను అనుగ్రహించారు. తొలుత ఉదయం అమ్మవారికి అర్చకుడు శివకుమార్ శర్మ ప్రత్యేక పూజలు, శ్రీదుర్గా సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు

రామచంద్రాపురం: మండలంలోని సూరావారిపల్లె సమీపంలోని ఏకవీర సేవా ఫౌండేషన్‌కు చెందిన సురభి గోసంరక్షణశాలలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిమ్మరాజుపల్లెకు చెందిన న్యాయవాది ఎం.లీలాకృష్ణ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

వారాహిగా గంగమ్మ అనుగ్రహం



వారాహిదేవి అలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ, కన్యకా పరమేశ్వరి అమ్మవార్లు

తిరుపతి కల్చరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తాతయ్యగుంట గంగమ్మ, కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి వారాహి అమ్మవారిగా భక్తులను అనుగ్రహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, హోమం, కుంకుమార్చన చేశారు. మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో అమ్మవారు భువనేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పీఎంజే జ్యువెలర్స్ షోరూం ప్రారంభం



పీఎంజే జ్యువెలర్స్ సోరూంను ప్రారంభిస్తున్న కమిషనర్ మౌర్య, షోరూం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని న్యూ బాలాజీ కాలనీలో ఏర్పాటు చేసిన పీఎంజే జ్యువెలర్స్ షోరూంను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆరు దశాబ్దాలకుపైగా బ్రాండ్ వారసత్వంతో పనిచేస్తున్న పీఎంజే జ్యువెలర్స్‌ను తిరుపతిలో ఏర్పాటుచేయడం సంతోషకరమన్నారు. పీఎంజే జ్యువెలర్స్ రాష్ట్ర హెడ్ అలీ, క్లస్టర్ మేనేజర్ కె.అరవింద్ మాట్లాడుతూ షోరూం ప్రారంభంలో భాగంగా 9 రోజులు పెళ్లి, హాఫ్-సారీ ఆభరణాల ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తిరుపతి స్టోర్ మేనేజర్ చంద్రబాబు మాట్లాడుతూ షోరూంలో అద్భుతమైన డిజైన్లు, బిగ్గెస్ట్ వెడ్డింగ్ అండ్ హాఫ్ సారీ జ్యువెలరీ అందుబాటులో ఉన్నాయన్నారు.